ప్రజాశక్తి

శుక్రవారం 10 నవంబర్ 2023 | 5 | అనంతపురం

ఈ-పంట ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

రైతులకు ఈ-పంట ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఆవులదట్ల రైతు భరోసా కేంద్రంలో గురువారం ఖరీఫ్ 2023 ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతుకూ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం అందజేయాలని సూచించారు. అంతకుముందు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. తర్వాత ఆవులదట్ల, బొమ్మక్కపల్లి, 74 ఉడేగోళం గ్రామాల్లో వర్షాభావం వల్ల దెబ్బతిన్న వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, మండల వ్యవసాయాధికారి మహేంద్ర, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కడుపు కొడతామంటే సహించం..

గుడిసెలు తొలగించిన చోటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

అధికార దుర్వినియోగంపై చట్టపరంగా పోరాడుతాం

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, పాల్గొన్న నాయకులు, పేదలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం, కల్లూరు అగ్రహారం గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించి నిరుపేదలను రోడ్డు మీదకు పడేశారని పేదల కోసం పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గుడిసెలు తొలగించిన చోటే వారికి ఇళ్లనిర్మించి ఇవ్వాలని వామపక్ష, దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరులో గుడిసెలు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని, పేదలు, నాయకుల పట్ల దాడి చేసి అనుచితంగా వ్యవహరించిన సిఐ నరేంద్రరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదట గురువారం ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు గుడిసెలు కోల్పోయిన మహిళలు చంటిపిల్లలతో సహా వచ్చారు. సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఏసురత్నం, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చిన్న ఆంజనేయులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి చైర్మన్ సాకే హరి, జై భీమ్ సేనా జిల్లా నాయకులు తరిమెల రామాంజినేయులు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే ఉన్న ఫలంగా గుడిసెలు తొలగించి వారిని రోడ్లపై పడేశారని విమర్శించారు. అధికారం ఉంది కదా అని వైసిపి నాయకులు పేద ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడటం దుర్మార్గంగా ఉందన్నారు. దేవాదాయ శాఖ భూములంటూ పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించేశారని, అదే స్థలాల్లో అధికార పార్టీ నేతలు, ఇతరులు ఇళ్లు నిర్మించుకుని ఉన్నారని చెప్పారు. కొందరు ప్లాట్లు వేసి విక్రయించారని, వారిపై మాత్రం ఎలాంటి చర్యలు లేవని అన్నారు. కేవలం దళిత, గిరిజనులు, నిరుపేదలు వేసుకున్న 2 ఎకరాల భూమిని ఖాళీ చేయించేందుకు దేవాదాయ శాఖ అధికారులు చట్టాన్ని ప్రయోగించారన్నారు. అదే స్థలంపై హైకోర్టు దిశానిర్దేశం చేస్తే వాటి ఊసే ఎత్తకుండా ఏకపక్షంగా అధికార పార్టీ నేతల ఆదేశాలను అమలు చేయడం అన్యాయంగా ఉందన్నారు. సిఐ నరేంద్ర రెడ్డి అమానవీయంగా వ్యవహరించి మహిళలను దూషించాడన్నారు. బూతు పురాణంతో దౌర్జన్యంగా గుడిసెలు తొలగిస్తున్నారని తెలిసి తాము వెళితే తమపై కూడా దాడి చేశాడన్నారు. దళిత నేతలను కులం పేరుతో దూషించి కొట్టాడన్నారు. పోలీస్ అధికారి అయిఉండి రౌడీలా రెచ్చిపోయాడన్నారు. రౌడీగా ఉండాలను కుంటే ఖాకీ చొక్క విప్పేసి, రాజీనామా చేసి దౌర్జన్యానికి నరేంద్ర రెడ్డి వస్తే ప్రజల కడుపు మంట ఏమిటో తెలియజేస్తామన్నారు. అలా కాదని సిఐగా ఉండి ఇలాంటి చర్యలకు పాల్పడతానంటే సహించేది లేదన్నారు. చట్ట పరంగానే సిఐకి గుణపాఠం నేర్పుతామన్నారు. అధికారులు కూడా విచారణ జరిపారని, ఇంకా ఏ నిర్ణయం తీసుకున్నారో చెప్పాలేదని అన్నారు. అధికారుల నిర్ణయం తరువాత సిఐపై పోరాటానికి సిద్ధమవుతామన్నారు. సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న మాట్లాడుతూ పేదలకు అన్యాయం చేస్తాంటే కమ్యూనిస్టులుగా తాము సహించబోమన్నారు. ఎర్రజెండా నీడలో ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అలాంటి ఎర్రజెండాలో పని చేస్తున్న నాయకులపైనే చేయి చేసుకునే బరితెగింపు సిఐకి వచ్చిందంటే కమ్యూనిస్టులంటే నరేంద్రరెడ్డికి తెలియనట్లు ఉందన్నారు. ఇలాంటి అధికారులు, పోలీసులు వందల మందికి గుణపాఠం నేర్పామన్నారు. తొలుత పేదలకు న్యాయం జరగడమే వామపక్ష పార్టీల కర్తవ్యంగా అధికారులకు విజ్ఞాపన చేస్తున్నట్లు తెలిపారు. సిఐ నరేంద్ర రెడ్డి లాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించకూడదన్నారు. పేదల పట్ల అనుచితంగా వ్యవహరించినందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోలేదంటే ప్రభుత్వం సిఐ లాంటి వారిని ప్రోత్సహిస్తున్నట్లు ప్రజలకు సందేశం వెళ తుందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి వారిని ఉపేక్షించకూడదన్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పేరుకే దళిత ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆమె భర్త అగ్రవర్ణాలకు చెందిన వారు కావడంతో దళిత, గిరిజనులపైనే దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. కల్లూరు పేదలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసి చైర్మన్ సాకే హరి మాట్లాడుతూ గుడిసెలు తొలగించిన వారిలో అందరూ దళిత, గిరిజన నిరుపేదలే అన్నారు. పేదలపై ఇలాంటి దౌర్జన్యాలు సహించేది లేదన్నారు. చట్టాన్ని ఉపయోగించి అన్యాయం చేయాలని చూస్తే అదే చట్టం పేదలకు న్యాయం చేస్తుందన్న వాస్తవాన్ని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారు తెలుసుకోవాలన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగేంత వరకు ఐక్యంగా పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలక్రిష్ణ, నరసింహారెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జాతీయ మానవహక్కుల సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసూళ్ల పర్వంలో బాధ్యులపై చర్యలేవీ..?

గుమాస్తా బదిలీతో చేతులు దులుపుకున్న కమిషనర్

సూత్రధారిపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ శాఖ మంత్రి కుమారుడి నగర పర్యటన సందర్భంగా వసతి ఏర్పాట్ల కై లక్షల రూపాయలు వసూలు చేసిన ఘటనలో అధికారులు తూతూమంత్రపు చర్యలు తీసుకున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈఘటనలో కమిషనర్ పేషీలో సిసి గా ఉన్న ఒక గుమాస్తాను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో వసూళ్ల పాపం పరిహారమైనట్లు ఉన్నతాధికారి వ్యవహరిస్తున్నారన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. అయితే వసూళ్ల పర్వం చేపట్టిన వ్యక్తిపైనా, వసూళ్ల పర్వానికి పురమాయించిన అధికారిపైనా ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై ఉద్యోగ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి ఈ వసూళ్ల పర్వం వ్యవహారంలో తప్పు చేశామని అంగీకరించటానికి బదులు ఆ పనులు పురమాయించిన అధికారి సిసిపై ఉన్నదీ లేనీదీ కల్పించి చెప్పటం ద్వారా ఆ ఉద్యోగిని బలిపశువుగా చేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వసూళ్ల పర్వంలో వసూలు అయింది ఎంత, మింగింది ఎంత అన్న అంశాలపై లోతుగా దర్యాప్తు చేయడానికి ఉన్నతాధికారి సుముఖత చూపటం లేదని తెలుస్తోంది. ఉద్యోగిపై బదిలీ వేటు వేయడం ద్వారా వసూళ్ల పర్వం వ్యవహారం ముగిసినట్లేనని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా గుమాస్తా ఒక్కరే వసూళ్ల పర్వం చేపట్టారని కచ్చితంగా చెప్పలేం. ఉన్నతాధికారి పురమాయించినందుకే ఆ గుమాస్తా వివిధ విభాగాల నుంచి మంత్రి తనయుడి వసతి ఏర్పాటు, వాహన ఏర్పాటు, భోజన వసతి తదితరాలు ఖర్చుకై ముక్కు పిండి వసూలు చేపట్టినట్లు సమాచారం. మంత్రి తనయుడి పర్యటనకు ఖర్చు అయిన దానికంటే రెండింతలు అధికంగా వసూళ్ల పర్వం కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ వసూళ్ల పర్వం పైనే ఉద్యోగ వర్గాలలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే ఈ అంశాన్ని గుర్తించకుండా బాధ్యతాయుత స్థానంలో ఉండి వసూళ్ల పర్వానికి పురమాయించిన ఆ అధికారి నిర్వాకంపై మాత్రం ఉన్నతాధికారి నోరు మెదపకపోవడం విశేషం. వసూళ్ల పర్వం సమయంలో ఆ అధికారి కార్పొరేషన్ ఇన్‌ఛార్జి బాధ్యతలు సైతం వెలగబెట్టడం గమనార్హం. కార్పొరేషన్‌లో ఒక్కో విభాగాన్ని ఒక్కో అధికారి లేదా విభాగాధికారి పర్యవేక్షిస్తుంటారు. అయితే వసూళ్ల పర్వంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి అన్ని విభాగాలలో జోక్యం చేసుకోవడం, పనులు పురమాయించడం ఇతర అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఉన్నతాధికారి లాగే ఆ అధికారి సైతం ఏ చిన్న పని అయినా సరే మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ డిఎంఎకు లేఖ రాసి క్లారిఫికేషన్ అడుగుతామంటూ చిలక పలుకులు వల్లే వేస్తుంటారు, డిఎంఎ క్లారిఫికేషన్ పేరుతో తాము ఎంతో నిజాయితీగా పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు కలరింగ్ ఇచ్చుకుంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ మాన్యువల్ ప్రకారం విధుల కేటాయింపులో కూడా వివక్షతను ప్రదర్శిస్తున్నా పాలకవర్గం ఇదేమిటని ప్రశ్నించటానికి ఆసక్తి చూపక పోవటానికి కారణం ఆ ఇద్దరికీ ఆయన అన్ని బాగోగులు చూసుకోవటమే కారణమన్న ఆరోపణలు సైతం వినపడుతున్నాయి. ఆయన కార్పొరేషన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సమయంలో రెవిన్యూ విభాగంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వారి లాగిన్లలో ఫైళ్లు పెండింగ్ ఉన్నాయంటూ మెమోలు జారీ చేశారు. అయితే ఆయన ఇన్‌ఛార్జిగా లేని సమయంలో మాత్రం ఏనాడు వారికి మెమోలు జారీ చేసింది లేదు. ప్రజారోగ్య విభాగ పర్యవేక్షణ అధికారులు ఒకరైతే కార్మిక సమస్యలు వాటి పరిష్కార మార్గాలు సూచించేవారు మరొకరు కావడంతో ఆ విభాగంలో సమస్యలు జటిలంగా మారుతున్నాయి. అలాగే రెవెన్యూ విభాగం గానీ మెప్మా విభాగంగాని ఇంజనీరింగ్ విభాగం గానీ ఇలా అన్ని విభాగాల్లో రోజురోజుకు సమస్యలు జటిలంగా మారడం చూస్తే కర్ర పెత్తనం సాగించే వారి చర్యలకు బ్రేక్ వేస్తే కానీ సమస్యలు పరిష్కార దిశగా వెళ్లవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో డిఇలకు గదుల కేటాయింపు జరపాలని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించిగా రాత్రి తొమ్మిది గంటల సమయంలో అధికారులను వెంటబెట్టుకొని ఆ అధికారి హడావుడి చేశారే కాని ఇప్పటికీ డిఇలకు గదుల కేటాయింపు జరగకపోవడం గమనార్హం. ఇలా చెప్పుకుంటూ పోతే కార్పొరేషన్ లోని ప్రతి విభాగం సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతూ పాలన అస్తవ్యస్తంగా మారటానికి ఆ అధికారి నిర్వాకాలే కారణమని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

మనోళ్లదే.. చూసీ చూడనట్లు పోండి...

యథేచ్ఛగా ఇసుక, మట్టి మాఫియా

శింగనమలలో అడుగడుగునా అక్రమాలు

పట్టుకుంటే రెడ్డిగారినుంచి ఫోన్

వందకు డయల్ చేసినా ఫలితం శూన్యం

'మనోళ్లదేనబ్బా... చూసీ చూడనట్లు పోవాలి...మీకు మళ్లీ చెప్పాలా... వదిలేయండి.' అంటూ ఇసుక, మట్టి దందాలపై అధికారులకు ముఖ్య నేతల నుంచి ఆదేశాలు వెలుతున్నాయి. దీంతో యధేచ్ఛగా శింగనమల నియోజకవర్గం పరిధిలో ఇసుక, మట్టి తవ్వకాలు జరుగు తున్నాయి. వందకు డయల్ చేసినా వెనక్కు తగ్గకపోవడంతో పోలీసులే మౌనంగా వెనుదిరిగి రావాల్సిన పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల మండలం తరిమెల గ్రామంలో ఒక ప్రజాప్రతినిధి పక్కనేవున్న వంకలో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లో లోడ్ చేసి గ్రామం మధ్యలో ఉంచారు. ఇది చూసి గ్రామస్తుడు వందకు డయల్ చేసి అక్రమంగా తవ్విన ఇసుక ట్రాక్టర్ ఉందని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఆ గ్రామం పరిధిలోని పోలీసులు రాత్రి సమయంలోనే అక్కడికెళ్లారు. ఈ ట్రాక్టర్‌లో అక్రమ ఇసుక ఉందని, దీన్ని స్టేషన్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. అయితే సదరు ప్రజాప్రతినిధి ఏ రకంగా తీసుకెళుతావంటూ పోలీసులపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది గ్రామంలోని తక్కిన ప్రజానీకం చూస్తుండగానే సాగింది. ఈ వ్యవహారం నడుస్తున్న సమయంలో అదే గ్రామంలో ఉంటున్న మరో ప్రజాప్రతినిధి ఫోన్ చేసి మనదే... చూసిచూడనట్టు పోవాలని పోలీసులకు సూచించారు. 'వందకు డయల్ చేసారు సార్...మాకు ఇబ్బంది అవుతుంది.. ట్రాక్టర్‌ను తీసుకెళుతా'మని పోలీసులు చెప్పినా వినకుండా అడ్డుపడ్డారు. ఇంతలోనే నియోజకవర్గ ముఖ్య నేత కూడా సదరు పోలీసులకు ఫోన్ చేసి...'ఏందబ్బా..మీకు మళ్లీ చెప్పాలా... చూసిచూడనట్టు పోండబ్బా'..అని చెప్పారు. ఆ నేతకు కూడా పోలీసులు ఇదే విధంగా వందకు ఫోన్ చేసారని చెప్పడంతో 'ఏదో ఒకటి చేసి, ట్రాక్టర్ లేదని చెప్పండి' అని చెప్పండని సలహా ఇచ్చారు. ఇదే విషయాన్ని ఆయన సర్కిల్ అధికారికి కూడా చెప్పడంతో ఆ అధికారి లైన్‌లోకి వచ్చారు. ఆ ట్రాక్టరు ఇసుకను ప్రభుత్వ పని కోసం తెచ్చామని ఆసుపత్రి నిర్మాణం వద్ద వదలించి, వందకు ఫోన్ చేసిన సమస్య క్లియర్ అయినట్టు చూపించాలని చెప్పడంతో..అదే పనిని సదరు పోలీసులు చేయాల్సి వచ్చింది. అయితేఈ వ్యవహారమంతా జనం మధ్యలోనే సాగడం గమనార్హం.

యథేచ్ఛగా తవ్వకాలు

ఇది ఒక ఘటన మాత్రమే ఇలా ఈ నియోజకవర్గం పరిధిలో ఏ వంకలో చూసినా పట్టపగలే ఇసుక తవ్వకాలు నడుస్తున్నాయి. అదే విధంగా కొండలను తొలిచేస్తున్నారు...కార్యాలయాల ఎదుటే అంతా జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్లకు గంతలకు కట్టుకున్నట్టు మౌనంగా వీక్షించడం తప్ప వాటిని ఆపే చర్యలేవి ఉండకపోవడం గమనార్హం. శింగనమల మండల పరిధిలోని జూలకాలువ, గురుగుంట్ల, తరిమెల, జలాలపురం, రాచేపల్లి పెరవలి ఇలా మొత్తం ఎనిమిది గ్రామాల్లో ఇసుక తవ్వకాలు నడుస్తుండగా, మూడు గ్రామాల్లో మట్టి తవ్వకాలు జెసిబిలతోనే నడుస్తున్నాయి. ఎక్కడైనా పోలీసు సిబ్బంది వీటిని పట్టుకుంటే వెంటనే రెడ్డిగారి నుంచి ఫోన్ వస్తుంది. వదలి పెట్టమని హుకుం జారీ అవుతుంది. వీటిని అధికారులు శిరసావహించడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితుల్లోనున్నారు. ఏమైనా అంటే నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో ఆ నియోజకవర్గం నేతకు పలుకుబడి ఉందన్న ప్రచారం నడుస్తుండటంతో అధికారులు మౌనం వహించడం తప్ప ఏమీ చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉంటున్నారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమ తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి.

నదుల అనుసంధానానికై సైకిల్ యాత్ర

తమిళనాడు వ్యక్తి 'అనంత' మీదుగా పయనం

సైకిల్‌యాత్రలో ఎస్. సంజీవి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో నదుల అనుసంధానాన్ని కాంక్షిస్తూ తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ ఏడాది జూన్ ఒకటవ తేదీన ఆయన ప్రారంభించిన సైకిల్ యాత్ర గురువారం అనంతపురం నగరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆయన జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద వెళ తుండగా ఆయనను 'ప్రజాశక్తి' పలుకరించింది. ఈ సందర్భంగా ఆయన తన సైకిల్ యాత్ర వివరాలను వెల్లడించాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లి జిల్లాకు చెందిన అమ్మయ్యరుకుప్పం గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు ఎస్.సంజీవి దేశంలో నదుల అనుసంధానం చేయాలని ఈ యాత్రను చేపట్టాడు. జూన్ ఒటవ తేదీన తమిళనాడులోని తిరుత్తినిలో ఈ యాత్ర ప్రారంభించి కర్నాటక, గోవా, మహారాష్ట్ర మీదుగా గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ మీదుగా కోల్‌కతా, భువనేశ్వర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించినట్టు సంజీవి ఈసందర్భంగా తెలిపారు. తిరిగి కర్నాటక మీదుగా చెన్నైలో ఈ యాత్రను ముగించనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు 7750 కిలోమీటర్లు ఒంటరిగా ఈ యాత్రను చేపట్టినట్టు వివరించాడు. దేశానికి వెన్నముక రైతు అని ఆ రైతుకు సాగునీటిని అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నాడు. అనేక రాష్ట్రాల మధ్య సాగునీటి సమస్యలు అనేకమున్నాయన్నాడు. వీటన్నింటికీ పరిష్కారం జరగాలంటే దేశంలో నదుల అనుసంధానం చేయడమే మార్గమని తాను భావిస్తున్నట్టు చెప్పాడు. అందుకే నదుల అనుసంధానం ప్రాధాన్యతను వివరిస్తూ ఈ యాత్రను చేపట్టినట్టు సంజీవి తెలిపాడు. గతంలో కూడా రెండు పర్యాయాలు ఇదే రకంగా యాత్రను చేపట్టానన్నారు. ఈ యాత్ర ముగిసిన తరువాత కర్నాటక ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కలసి నదుల అనుసంధానం గురించి తన అనుభవాలను వివరిస్తానని సంజీవి చెప్పాడు.

జిల్లా అభివృద్ధి కోసం ఐక్య పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ - ముగిసిన స్కూటర్ యాత్ర

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 6 నుంచి చేపట్టిన స్కూటర్ యాత్ర గురువారం కలెక్టరేట్ వద్ద ముగిసింది. జిల్లాలో 27 మండలాలు మీదుగా నిర్వహించిన స్కూటర్ యాత్రలో వేలాది మంది ప్రజలను కలిసి సిపిఎం రూపొందించిన జిల్లా సమగ్రాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఇందులో భాగంగా రుద్రంపేట బైపాస్‌కు చేరుకున్న స్కూటర్ యాత్రకు సిపిఎం నగర కమిటీ స్వాగతం పలికింది. అక్కడి నుంచి బయలుదేరిన స్కూటర్ యాత్ర అంబేద్కర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా సర్వజనాసుపత్రి, సంగమేష్ సర్కిల్, కలెక్టరేట్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లా అభివద్ధి కోసం అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావాలన్నారు. జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఇందుకు ప్రకతి, భౌగోళిక పరిస్థితులు కాదని పాలకులకు చిత్తశుద్ధిలేకపోవడమే ప్రధాన కారణమని విమర్శించారు. 75 ఏళ్ల స్వదేశీ పాలనలో మన జిల్లా సాగు భూమిలో కేవలం 3.04 భూమికి మాత్రమే నీటి వనరులు వుండడం వెనుకబాటుకు మూల కారణం అన్నారు. తుంపెరసేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్లు) మాత్రమే మన జిల్లా రైతాంగానికి దిక్కుగా దిగజార్చారని విమర్శించారు. తక్కువ నీటితోనే ఎడారిలో పండే కర్జూరాలు, మంచు ప్రాంతంలో పండే ఆపిల్, ఆధునికమైన డ్రాగాన్ ఫ్రూట్స్ పండించి రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ భూమిలో పండ్లను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఈ పంటలకు అనుగుణంగా మార్కెట్ సౌకర్యం కలిపించడంలోనూ, ఆధునిక పరిజ్ఞానం అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాకు సుమారుగా 15 సంవత్సరాలుగా హంద్రీనీవా నీరు వస్తున్నా ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణం కరువు సహాయచర్యలు చేపట్టాలన్నారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కాగా జిల్లాలో వెయ్యి మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా స్థాపించకపోవడంతో, ప్రతి సంవత్సరం వేలసంఖ్యలో ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, పి.జీలు పూర్తిచేసిన యువతీ, యువకులు పొట్ట చేతబట్టుకుని ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి కొనసాగుతోందన్నారు. పనుల కోసం తల్లితండ్రులు, ఉద్యోగాల కోసం యువతీ, యువకులు, చదువుల కోసం పిల్లలు వలసలు పోతున్న స్థితిపై పాలకులు స్పందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రుల నిర్వహణ పట్ల ప్రభుత్వం కనీస శ్రద్ధపెట్టడంలేదు. అనంతపురం మెడికల్ కాలేజీలో పడకల సంఖ్యను 1500కు పెంచి, నిధులు, సిబ్బందిని పెంచాలన్నారు. ఆరోగ్యశ్రీ ఆపరేషన్‌ల కోసం సహాయక సిబ్బందిని నియమించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన నిధులను ప్రత్యేకంగా కేటాయించి, సిబ్బందిని నియమించాలన్నారు. సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళికను జిల్లా అధికారులకు, అన్ని పార్టీలకు, ప్రజా ప్రతినిధులకు అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూటౌన్ కార్యదర్శి ఆర్.వి.నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలయ్య, ఎస్. నాగేంద్రకుమార్, నాయకులు క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్రెడ్డి, ముత్తుజా, నరసింహారెడ్డి, ఇర్ఫాన్, నాగరాజు, నాగభూషణం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'జగనే ఎందుకు'..?

కుందిర్పిలో ఖాళీ కుర్చీలతో 'మమ' అనిపించిన వైనం...

కార్యక్రమంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ప్రజాశక్తి-కుందుర్పి

సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం తూతూమంత్రంగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-1 వద్ద 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్యక్రమం సాగుతున్నంత సేపూ ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం గమనార్హం. కేవలం స్టేజిపైన ఉన్న నాయకులు, అధికారులు తప్ప ఎదురుగా ఉన్న కుర్చీల్లో నామమాత్రంగా కూడా కనిపించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అతి తక్కువ మందితో కార్యక్రమం నిర్వహిస్తే ఇక జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలని ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తారని స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎంపీపీ కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, వైసిపి శ్రీలక్ష్మి అజయ్ బాబు, సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ ఈ రాము, సచివాల కన్వీనర్ నాగలక్ష్మి, బూత్ మండల కన్వీనర్ నరేష్, మాజీ జడ్పిటిసి రాజగోపాల్, జిన్న ఓబులేసు, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

15న 'ప్రజారక్షణ భేరి'ని విజయవంతం చేద్దాం

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

ఉరవకొండలో గోడపత్రికలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విజయవాడలో ఈనెల 15న నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం కూడేరు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జాతాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈజాతాలు 15న ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, చేతివృత్తిదారులు, చిన్న సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశులు, సహాయ కార్యదర్శి కరీం, సీనియర్ నాయకులు వీరభద్రప్ప, మండల నాయకులు మధు, సూరి, శీన, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిస్తూ పరిష్కారం చూపాలని కోరుతూ ఈనెల 15ను విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో బస్సుజాతాలు చేపట్టామన్నారు. జాతాలు ముగింపు సందర్భంగా బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లా నుంచి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు హనుమంతురెడ్డి, నాగరాజు, శ్రీరాములు, రామ్మోహన్, రామకృష్ణ, రవి, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి వినాయక కూడలి వరకూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకుడు నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాతాలు నిర్వహించి 15న ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రజలు, కార్మికులు, రైతులు పెద్దఎత్తున సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, కృష్ణానాయక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒ బి.గాయత్రిదేవికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతు సంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

రైతు రుణాలు మాఫీ చేయాలి - 'ఉపాధి' పనులు కల్పించాలి
డిఆర్ఒ గాయత్రీదేవికి రైతు సంఘాల నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, బాల రంగయ్య, కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఎపి రైతు సంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిఆర్ఒ బి.గాయత్రిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు పని కల్పించి రూ.600 చెల్లించాలన్నారు. వర్షాభావంతో ఖరీఫ్‌లో వేసిన ఏ ఒక్క పంట చేతికి రాలేదన్నారు. మరోవైపు హెచ్ఎల్‌సి, హంద్రీనీవా కాలువ కింద వేసిన మిరప, మొక్కజొన్న తదితర పంటలు చేతికి వచ్చే సమయంలో కాలువలకు నీరు బంద్ చేసేందుకు పూనుకున్నారన్నారు. పంటలు పూర్తయ్యే వరకూ నీరు ఇవ్వాలన్నారు. వేరుశనగ, కంది తదితర పంటలకు ఎకరానికి రూ.50 వేలు, మిరప తదితర పంటలకు ఎకరాకు రూ. 1 పరిహారం ఇవ్వాలన్నారు. వర్షాభావం వల్ల విత్తనం వేయలేని రైతులకు ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రతి కుటుంబానికీ రూ.25వేలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కౌలు రద్దు చేసి పంట నష్టపరిహారం కౌలుదారులకు చెల్లించాలన్నారు. రైతు కౌలు రైతు వ్యవసాయ కార్మిక కుటుంబాల విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కౌలు రైతులకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, నాయకులు పోతులయ్య, నల్లప్ప, రాముడు, ఆంజనేయులు, సుంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ప్రయివేట్ ఉద్యోగి మృతి

మృతిచెందిన ఎర్రిస్వామి

బొమ్మనహాల్ : విద్యుత్ అధికారుల నిరక్ష్యం కారణంగా మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన ప్రయివేటు విద్యుత్ ఉద్యోగి కురువ ఎర్రిస్వామి మృతి చెందినట్లు భార్య గంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... బొమ్మనహాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సి తీసుకుని ఉంతకల్లులో విద్యుత్ స్తంభం ఎక్కి కరెంటు పని చేస్తుండగా ఉన్నట్టుండి విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపారు. దీంతో తీవ్రంగా గాపయడి విద్యుత్ స్తంభం నుంచి కింద పడినట్లు తెలిపారు. వెంటనే బొమ్మనహాల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోంస బళ్లారికి తరలించగా బళ్లారి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని భార్య వాపోయింది. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి కుటుంబం వేడుకుంది.

వేతనాలు చెల్లించాలి : సిఐటియు

అంబేద్కర్ విగ్రహానికి పంచాయతీ కార్మికుల వినతి

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

తాడిపత్రి : ప్రతినెలా తప్పని సరిగా వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు, గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు కోరారు. ఈమేరకు ప్రతినెలా వేతనాలు చెల్లించేలా అధికారులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం తాడిపత్రిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి హనుమంతరెడ్డి మాట్లాడుతూ మూడునెలలకోసారి వేతనాలు చెల్లిస్తుండటంతో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అంతేగాకుండా వారికొచ్చే అరకొర వేతనాలతో జీవనం కష్టతరంగా ఉంటోందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతోపాటు విద్య, వైద్యం కూడా అందుబాటులోని దుస్థితి అన్నారు. వెంటనే వేతనాలు పెంచడంతోపాటు ప్రతినెలా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కొబ్బరి నూనె, సబ్బులు, పనిముట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కమిటీ సభ్యురాలు కవిత, పంచాయతీ వర్కర్లు రామకృష్ణ, సంధ్యాభాయి, రాజు, రామంజి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉప ఖజానాధికారికి సురేష్‌బాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, కార్యదర్శి కె. రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతినెలా 1న పెన్షన్ చెల్లించాలన్నారు. జీవోలు ప్రకారం డిఏలు, అరియర్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు మాబుసాబ్, షేక్షావలి, విజయభాస్కర్ రెడ్డి, పామిడి, పెద్దవడుగూరు మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు.

గుత్తి ఎస్‌ఐగా నబిరసూల్

గుత్తి : నూతన ఎస్‌ఐగా నబిరసూల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసులు అనంతపురానికి వెళ్లారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనంతపురం త్రీటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న నబిరసూల్ ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

గుత్తి : ఈనెల 11న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.సునీత పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పామిడి మండల అధ్యక్షుడు కె.లాలెప్ప, నాయకులు పకీరప్ప, దైవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి

బుక్కరాయసముద్రం : టిడిపి అధినేత చంద్రబాబుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. గురువారం మండలంలోని బోయ కొట్టాలపల్లి గ్రామంలో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో లోపాలను సరిదిద్దాలి

రాయదుర్గం : ఓటరు జాబితాలో లోపాలను సరిదిద్దాలని టిడిపి నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరప్రసాత్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు బలరామ్‌రెడ్డి, క్లస్టర్లు కేశవరెడ్డి, సిద్దప్ప, ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు అవగాహన

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో పత్తి పంట సాగు చేసిన రైతులకు వ్యవసాయ శాఖ, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పత్తిపంటను ఆశించే గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామి, శాస్త్రవేత్త రాధిక, గ్రామ వ్యవసాయ అధికారి రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని పొలికి గ్రామంలో సర్పంచి బోయ నాగమ్మ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఫాగింగ్ చేసినట్లు సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, వైద్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్

నార్పల : మండల పరిధిలోని గడ్డంనాగేపల్లి, నడిమిదొడ్డి పంచాయతీల్లో ఒక్కొక్క వాలంటరీ నియామకానికి గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. గడ్డంనాగేపల్లిలో బిసి-డి, నడిమిదొడ్డిలో బిసి-ఎకు కేటాయించినట్లు ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అన్నదానం చేస్తున్న నిర్మలమురళి

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మల మురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ఒంటెద్దు రామకృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వారి సతీమణి లక్ష్మీదేవి, పెద్ద కుమారుడు గోపాలరెడ్డి, కోడలు శోభారాణి, చిన్న కుమారుడు భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి శారద కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యాం, ఓబుళపతి, కిష్టప్ప, సుబ్బారావు, జగన్నాథ్, నబిరసూల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భవిష్యత్ బాగుండాలంటే 'మళ్లీ జగనే కావాలి'

విప్ కాపు రామచంద్రారెడ్డి

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే సిఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పార్వతీనగర్ సచివాలయం.1 పరిధిలో ప్రభుత్వ సంక్షేమ లబ్ధి వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, ధనిక తారతమ్యాన్ని అంతం చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. దీని చూసి టిడిపి, ప్రతిపక్షాలు ఓర్చుకోలేకపోతున్నాయన్నారు. ఎన్నికల ముందు వచ్చే నాయకులను ప్రజలు నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, మాజీ అధ్యక్షులు ఉపేంద్రరెడ్డి వైసిపి పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, నాయకులు వలిబాషా, నాగవేణి, గోవిందరాజులు, లావణ్య, పద్మజ, శారద, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, అజయ్‌కుమార్, శ్రీనివాసులు, నజీర్, మాధవరెడ్డి, శ్రీనివాసులు, శివకుమార్, నాగప్ప, దివాకర్, కష్ణమూర్తి, బషీర్, ఇస్మాయిల్, సత్యనారాయణ, దిలావర్ బాషా, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి తెలిపారు. గురువారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ సచివాలయం-1లో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయ ఆవరణంలో లబ్ధిపొందిన లబ్ధిదారుల వివరాలును తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, ఎంపిటిసిలు దాసరి వెంకటేష్, శివగౌడ్, సచివాలయ కన్వీనర్ డిష్ వెంకటేష్, సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు, ఎంఎల్‌ఒ కుళ్లాయిస్వామి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గాజుల మల్లాపురం శంకర్‌గౌడ్, నల్ల సుంకన్న, గంగప్ప, కుడితిని రాము, సునీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలంటే మరోసారి సిఎం జగన్ కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బష్‌షెల్టర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, వైసీపీ నాయకులు వీరన్న, ఎంపీపీ పెద్దన్న, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మచ్చన్న, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, నాయకులు నాగిరెడ్డి, రామాంజనేయులు, పి.శ్రీనివాసులు, రవినేపల్లి సర్పంచు రమేష్, రామిరెడ్డి, రుద్రానంద, వెంకటరెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాలాపురం గ్రామ సచివాలయం వద్ద 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేశ్వరరావు సర్పంచి రామకృష్ణారెడ్డి, రవిచంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కృష్ణవేణి, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

తల్లిదండ్రులపై కేసు నమోదు

బాలబాలికల తల్లిదండ్రులుకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం : కలెక్టర్, ఎస్పీ చొరవతో మండలంలోని గోవిందంపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు గురువారం అడ్డుకున్నారు. మైనర్లకు పెళ్లి చేసేందుకు సిద్ధమైన బాల, బాలికల తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని గోవిందంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఓ కాలనీలో బాలుడు (17), బాలిక (13)కు వారి ఇంటి ముందే పెళ్లి చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రూరల్ డీఎస్పీ బి.వి శివారెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. మైనర్లకు పెళ్లి చేస్తున్నట్లు నిర్ధారించుకున్నాక బాల, బాలికల తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజయవాడ బస్సు సర్వీసు రద్దు చేయొద్దు..

రాయదుర్గం : రాయదుర్గం ఆర్టీసీ డిపో నడుపుతున్న విజయవాడ వయా అనంతపురం సర్వీసును రద్దు చేయవద్దని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం పట్టణంలోని విప్ కాపు రామచంద్రారెడ్డి నివాసం వద్ద విప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు విప్ స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి బస్సు సర్వీసు రద్దు కాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ జాయింట్ సెక్రటరీ ఎం.నాగరాజు, డిపో అధ్యక్ష కార్యదర్శులు జిలాన్, కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు జగదీష్, కుమార్, మాలిక్‌బాషా, గోపీకృష్ణ, ఎల్.రామాంజనేయులు, వెంకోజీరావు, తదితరులు పాల్గొన్నారు

గర్భిణులకు వైద్య పరీక్షలు

బుక్కరాయసముద్రం : ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు స్వాతిలక్ష్మి, తహీరున్నీసా ఆధ్వర్యంలో హైరిస్క్ గర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. దాదాపు 52 మంది హైరిస్క్ గర్భిణులు పాల్గొనగా చిప్పల చంద్రశేఖర్ ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మోహన్‌రావు, పిహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు బి.ఈశ్వరమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు కీర్తి, జ్యోతి, శ్రీజ, భవాని, గౌతమి, మంజు భార్గవి, జయంతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు కౌన్సిలింగ్

అనంతపురం : పారామెడికల్ కోర్సుల్లో ఇంకా మిగిలిపోయిన సీట్లకు రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డాక్టర్ కెఎస్ఆర్ గఫూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ కెఎస్.అబ్దుల్ రజాక్ గఫూర్ తెలిపారు. గురువారం అనంతపురంలోని గఫూర్ కాలనీలో ఉన్న డాక్టర్ కెఎస్ఎ ఆర్ గఫూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-2024 విద్యా సంవత్సరానికి పారామెడికల్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్ పూర్తయిన వారంతా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చు తెలిపారు.

నీటిశుద్ధిపై అవగాహన ఉండాలి : మేయర్

బస్సును ప్రారంభిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నీటిశుద్ధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరానికి సరఫరా అయ్యే తాగునీటి ఫిల్టరేషన్ ప్రక్రియపై ఆరోగ్య మిత్రలకు అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం పట్టణ పేదరిక నిర్మూలన విభాగం మెప్మా ఆధ్వర్యంలో పిఎబిఆర్ డ్యాం, ముద్దాలాపురం ఫిల్టరేషన్ ప్లాంటును సందర్శించారు. ఈమేరకు స్థానిక కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయలుదేరిన బస్సును మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటివృథాను అరికట్టి జల వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో స్వయం సహాయక గ్రూపుల నుంచి ఎంపిక చేసిన 50 మంది అమృత్ మిత్రలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు శుద్ధి చేసిన రక్షిత నీటిని అందించేందుకు వాటర్‌వర్క్స్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తుంటారన్నారు. అలాంటి సిబ్బంది నీటి శుద్ధిపై తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే నగర ప్రజలు నీటి వనరులను దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, పీడీ విజయలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, వాటర్‌వర్క్స్ ఇఇ సూర్యనారాయణ, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు భువనేశ్వరి, సుగుణ, జయంతి, సుశీల, పల్లవి, శిరీషా, సత్యమూర్తి, వేణుగోపాల్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అపోహాలు వద్దు..

చిన్నపిల్లల వైద్యులు ఎ.మహేష్

ప్రజాశక్తి-అనంతపురం

చిన్నపిల్లల టీకాల (వ్యాక్సిన్లు)పై అపోహాలు వీడాలని చిన్నపిల్లల వైద్యులు ఎ.మమేష్ సూచించారు. శుక్రవారం ప్రపంచ ఇమ్యునైజేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో టీకాలు కీలకమైన పాత్ర వహిస్తాయన్నారు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి పెంచడానికి చాలా ఉపయోగపడుతాయన్నారు. అయితే ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల టీకాలపై అనేక అపోహాలు ఉన్నాయన్నారు. టీకాలు వేస్తే పిల్లలు బలహీనపడటం.. వ్యాధులు వ్యాప్తి చెందుతాయనే అనుమానాలు ఉన్నాయన్నారు. కానీ అవి నిజం కాదన్నారు. టీకాలు వేయడం ద్వారా చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, పోలియో, వంటి అంటు వ్యాధులు దరి చేరవన్నారు. వ్యాక్సిన్ తీసుకున్నప్పుడు అది మనల్ని మాత్రమే కాకుండా మన చుట్టూ ఉన్న వ్యక్తులను కూడా రక్షిస్తుందన్నారు. ఎందుకంటే వ్యాధిని వ్యాప్తి చేయకుండా ఆపుతాయన్నారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారిని నియంత్రించడానికి, గెలవడానికి టీకా ఎలా సహాయ పడ్డాయో మనం చూశామన్నారు. టీకాల సాయంతో అనేక ప్రాణాంతక అంటువ్యాధుల సంభవనీయతను, స్మాల్ పాక్స్‌ను తగ్గించగలిగామన్నారు. అంతేకాకుండా ప్రపంచం నుంచి పోలియోను పూర్తిగా నిర్మూలించగలిమన్నారు. ఇకపోతే టీకాలు వేయించేందుకు ప్రభుత్వం కూడా ప్రజలను ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చాలా వరకూ వ్యాక్సిన్‌లను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. టీకాలు వేయించడం ద్వారా నొప్పి, జ్వరం వంటి దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. పిల్లలకి దగ్గు, జలుబు ఉంటే టీకాలు వేయడానికి చింతించవద్దని సూచించారు.

ఉద్యానవన అధికారి లేక రైతుల తిప్పలు



పిచ్చి మొక్కల నడుమ నార్పల ఉద్యానవన అధికారి కార్యాలయం

ప్రజాశక్తి-నార్పల

మండలానికి ఉద్యాన అధికారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారి లేకపోవడంతో సిబ్బందిగానీ, రైతులుగానీ ఉద్యానవన కార్యాలయానికి రాక కార్యాలయం ప్రాంతం ఓ చిన్నపాటి అడవిని తలపిస్తోంది. ఇక్కడ పని చేసిన ఫజులన్నీషాబేగం నాలుగు నెలల క్రితం పదోన్నతి పొంది బదిలీపై అనంతపురానికి వెళ్లింది. అప్పటి నుంచి బుక్కరాయసముద్రం ఉద్యాన అధికారిణి శైలజాను నార్పల, పుట్లూరు మండలాలకు ఇన్‌ఛార్జి ఉద్యాన అధికారిణిగా నియమించారు. ఆమె బుక్కరాయసముద్రం చూసుకోవడానికే మాత్రమే సమయం సరిపోతోందని, ఇన్‌ఛార్జిగా ఉన్న మండలాలకు వెళ్లి చూసే సమయం లేకుండా పోతోందని చెబుతున్నట్లు సమాచారం. కేవలం ఏవైనా సమావేశాలు మాత్రం ఉంటే వస్తూ.. మిగిలిన సమయంలో అక్కడే ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యానవన పంటలకు ఏవైనా చీడలు, పీడలు వస్తే ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల రైతుల ఇబ్బందులను గుర్తించి మండలానికి రెగ్యులర్ ఉద్యాన అధికారిని నియమించాలని కోరుతున్నారు.

తాహా బ్యూటీ ట్రెండ్స్ ప్రారంభం



తాజాబ్యూటీ ట్రెండ్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని అనంతపురం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తాహా ఫ్యామిలీ బ్యూటీ ట్రెండ్స్‌ను తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొప్రయిటర్ చాంద్‌బాషా, ఫ్యామిలీ బ్యూటీ ట్రెండ్స్ వ్యవస్థాపకులు మాలిక్, తదితరులు ఎమ్మెల్యే పెద్దారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్, డోన్ నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, పారిశ్రామికవేత్త కె.శ్రీహరి, టౌన్‌బ్యాంకు అధ్యక్షులు ఎస్.అబ్దుల్‌జిలాన్‌తో పాటు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

In The Court of The Prl.District Judge:Ananthapuramu.
(In The Matter of Obtaining Permission to Sell the Property Of Minor Koneru Sonakshi)
G.W.O.P.No:63/2023

Between:
Koneru Vamsi Priya W/o K.Jithendra Kumar, R/of H.No:175, Seethapuram Colony, Poranki, Penamaluru Mandal, Krishna Dist, Now R/at D.No:36, Rainbow Villas, Tadepalli, Krishna Dist. ...Petitioner

And

To whom so ever it may concern ...Respondents

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో మైనరు అయిన Koneru Sonakshi కు సంబంధించిన ఆస్తిని అమ్ముటకు పై కోర్టులో అర్జీదారురాలు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 06/12/2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానించెదరని తెల్పడమైనది.

SCHEDULE -I
(As Per The Regd. Sale Deed dated 21.05.2018 U/D No. 2719/2018) Ananthapuramu R.D and Rayadurgam S.R.D with In Bommanahal Mandal, Nemakallu VIllage Polam and Panchayat area and the Property particulars are as follows.

Babu	Sy.No.	A.C.	A.C.
Govt. Dry	26-B	14.07 cants -out of this	2.75 cents

Bounded by: East :Land Of Gonalu Siddappa, West:Land of Satyanarayana North:Land of Malyam Bheemanna, South: Land of Neramatla Mallanna

SCHEDULE -II
(As per the Regd. Sale Deed datcd 21.05.2018. U/D No. 2720/2018 - Shown as Item No:1) Ananthapuramu R.D and Rayadurgam S.R.D with in Bommanahal Mandal, Nemakallu Village Polam and Panchayat area and the property particulars are as follows.

Babu	Sy.No.	A.C.	A.C.
GOvt. Dry	2	28.01 cents -out of this	8.01 cents

Bounded by:
East : Land of Koneru AJay Kumar
West: Land of Koneru Satish Babu
North: Forest land
South: Land of Koneru AJay Kumar

SCHEDULE-III
(As per the Regd. Gift Deed datcd 21.05.2018. U/D No. 2721/2018 -Shown as Item No:2) Ananthapuramu R.D and Rayadurgam S.R.D with In Bommenahal Mandal, Nemakallu Village Polam and Panchayal area and the propery particulars are as follows.

Babu	Sy.No.	A.C.	A.C.
Govt. Dry	3	9.86 cents -out of this	3.50 cents

Bounded by: East:Land of Rayampalli Parvathaiah, West:Executant's own land, North:Executant's own land, South: Executant' own land

(By Order of The Court)
S.KRANTHI KUMAR, J.ABHILASH,
ADVOCATES, ANANTHAPURAMU. CELL:9885882532

IN THE COURT OF HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE. ANANTHAPURAMU
H.M.O.P.No:286/2023

Between:
C.P.Basavaraju @ C.Basavaraju ...Petitioner
V/S
C.Mounika W/o C.P. Basavaraju @ C.Basavaraju D/o Manjunatha Aged About 24 Years, Hindu, House Wife, R/O Thummakunta Village, Kundurpi Mandal, Ananthapuramu Dist. A.P. Cell:8645886664, ...Respondent

Notice To Respondent
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 30-11-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
కె.మల్లికార్జున, డి.రాజు,
పిటీషనర్ తరుపు వకీలు, కళ్యాణదుర్గం.
సెల్:9440516511/అనంతపురం
సెల్:9441575698